సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం, 2, జూన్, 2023



మోగిన కాలేజీ గంట..

ఇంటర్మీడియెట్ కళాశాలలు గురువారం పునః ప్రారంభమయ్యాయి. తొలిరోజు అంతంతమాత్రమే విద్యార్థుల హాజరునమోదైంది. - 8లో



నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. జిల్లాలో 14 కేంద్రాల్లో 10129 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. - 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్టం	కనిష్టం
ఆమదాలవలస	40°	27°
ఇచ్ఛాపురం	39°	27°
పాతపట్నం	41°	26°
శ్రీకాకుళం	41	27°

న్యూస్‌రీల్

సాంఘిక సంక్షేమ శాఖ డీడీ బదిలీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె.రామారావును విశాఖపట్నం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో అనంతపురం సాంఘిక సంక్షేమ శాఖ డీడీ వై.విష్ణుమోహన్ రెడ్డిని నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో 180ని విడుదల చేసింది.

బీసీ సంక్షేమ శాఖలో బదిలీలు పూర్తి..

జిల్లా బీసీ సంక్షేమ శాఖ పరిధిలో ఉద్యోగుల బదిలీలు పూర్తయ్యాయి. ఆరుగురు కార్యాలయ సిబ్బంది, ఎనిమిది మంది సంక్షేమ వసతి గృహ అధికారులు, నలుగురు క్లాస్-4 సిబ్బందికి బదిలీ చేసినట్లు జిల్లా సంక్షేమాధికారి ఈ.అనూరాధ తెలిపారు.

రెవెన్యూ విభాగంలో..

జిల్లా రెవెన్యూ విభాగంలో ఈ సారి తక్కువ మందికి బదిలీలు జరిగాయి. తహసీల్దారు కేడర్‌లో ఏడుగురికి, డిప్యూటీ తహసీల్దారు కేడర్‌లో 16 మందికి, సీనియర్ అసిస్టెంట్, ఆర్‌ఐ కేడర్‌లో 14 మందికి, జూనియర్ అసిస్టెంట్ కేడర్‌లో ఆరుగురికి, వీఆర్‌వో కేడర్‌లో 39 మందికి బదిలీ చేస్తూ కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ ఎం.నవీన్ ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లా ఎండోమెంట్ అధికారిగా చంద్రశేఖర్



ఎస్.చంద్రశేఖర్

అరసవల్లి: జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖాధికారి (డీఈవో)గా సహాయ కమిషనర్ హోదా అధికారి ఎస్.చంద్రశేఖర్‌ను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాజాగా జరిగిన బదిలీల్లో భాగంగా అనకాపల్లి జిల్లా నూకాంబికా అమ్మవారి ఆలయ ఈవోగా పనిచేస్తున్న ఈయనకు స్థానిక జిల్లా బాధ్యతలు అప్పగించారు. ఇంతవరకు అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ఈవోగా ఉన్న వి.హరిసూర్యప్రకాష్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించగా..ఈయన నుంచి జిల్లా బాధ్యతలను చంద్రశేఖర్ త్వరలోనే స్వీకరించనున్నారు. అరసవల్లి ఈవోగా హరిసూర్యప్రకాష్ యథావిధి బాధ్యతలను కొనసాగించనున్నారు.

మలేరియా నిర్మూలిద్దాం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

అరసవల్లి: జిల్లాలో మలేరియా వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా పనిచేయాలని, ఇందుకు ఈ నెలాఖరు వరకు నిర్వహిస్తున్న మాసోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి పిలుపునిచ్చారు. గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద మలేరియా నిర్మూలన మాసోత్సవాల ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిత్తశుద్ధిగా కార్యక్రమాలు చేపడితే ప్రజల్లో కచ్చితంగా అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనూరాధ, జిల్లా మలేరియా నియంత్రణాధికారి పి.వి.సత్యనారాయణ, అర్బన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణమోహన్, విభాగాల అధికారులు ఎస్.శ్రీనివాసరావు, పైడి వెంకటరమణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా గ్రూప్-1 పరీక్షలు



మాట్లాడుతున్న డీఆర్‌ఓమురళీకృష్ణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఈ నెల 3 నుంచి 10 వరకు గ్రూప్ - 1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్-1 పరీక్షలకు సంబంధించి కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డీఆర్‌ఓ అధ్యక్షతన గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జూన్ 3 నుంచి 10 వరకు (4వ తేదీ మినహా) జరిగే పరీక్షలకు 353 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు వివరించారు. పరీక్షల నిర్వహణలో సమస్యలు తలెత్తితే ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.ప్రమీల (9014550846), సెక్షన్ ఆఫీసర్ అమ్మాజీ (9014550882) ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ తిప్పేస్వామి, పరీక్షల లైజన్ ఆఫీసర్ జి.గ్రేస్, చీఫ్ సూపరింటెండెంట్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు, అర్బన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జంపు కృష్ణమోహన్, ఆర్‌టీసీ, విద్యుత్ తదితరులు పాల్గొన్నారు.

● సాగుకు

సాంకేతిక సాయం



కోడి రామ్మూర్తి స్టేడియంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

సంప్రదాయ సేద్యవిధానాలతో రెక్కలు ముక్కలు చేసుకుంటున్న రైతన్నల కష్టాన్ని జగనన్న ప్రభుత్వం గుర్తించింది. సాగుకు సాంకేతికత జోడించి శ్రమ తగ్గించడంతో పాటు దిగుబడులు పెంచడం ద్వారా కృషీవలుని శ్రమకు తగిన ఫలం అందించేందుకు వైఎస్సార్ యంత్ర సేవా పథకానికి గతేడాది శ్రీకారం చుట్టింది. నేడు రెండో విడత పంపిణీకి రంగం సిద్ధమైంది.

- నేడు వైఎస్సార్ యంత్ర సేవా పథకం రెండో విడత అమలు
- జిల్లావ్యాప్తంగా 328 యూనిట్ల పంపిణీ
- రూ.37కోట్లకు పైగా వ్యయం
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
- చంద్రబాబు హయాంలో రైతు రథం కింద భారీ కుంభకోణం
- రూ.33లక్షల విలువైన 22 ట్రాక్టర్ల సొమ్ము హాంఫట్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. అందుకే విత్తనాల దగ్గర నుంచి పంట కొనుగోలు చేసే వరకు ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటోంది. గిట్టుబాటు ధరలు కల్పిస్తూ ఆసరాగా నిలుస్తోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా సహాయ సహకారాలు అందిస్తూ అండగా ఉంటోంది. రైతు భరోసా కింద ఏటా రూ.13,500, సున్నా వడ్డీకే రుణాలు, పంటల బీమా, ఎప్పటికప్పుడు నష్టపరిహారం అందజేత తదితర సహాయ కార్యక్రమాలు చేపడుతోంది. దీనికితోడు యాంత్రీకరణలో భాగంగా వైఎస్సార్ యంత్ర**సేవా** పథకం కింద రైతులకు అందు**బాటులో** ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, తదితర యంత్ర సా**మగ్రి సమ**కూర్చుతోంది.

అక్రమాలకు తావులేకుండా..

- వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద **గ్రూపుగా** ఏర్పడిన రైతు సంఘాలకు ప్రభుత్వం స**బ్సిడీతో** ట్రాక్టర్లు, ఇంప్లిమెంట్స్, హార్వెస్టర్లను సమకూర్చుతోంది.
- అక్రమాలకు అవకాశం లేకుండా నేరుగా రైతుగ్రూపులకే లబ్ధి చేకూర్చుతోంది.
- రైతుల అభీష్టానికి వదిలేసి, నచ్చిన ట్రాక్టర్లను కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించింది.
- దళారుల ప్రమేయం లేకుండా, బినామీలకు తావి**వ్వకుండా ట్రాక్టర్లను పంపిణీ చేస్తోంది.**



- **జిల్లా వ్యాప్తంగా గతేడాది జూన్ 7న తొలి విడ**తగా 236ట్రాక్టర్లు, 89 ఇంప్లిమెంట్స్, 35 కంబైన్డ్ హార్వెస్టర్లను రైతు సంఘాలకు కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల కింద 40 శాతం సబ్సిడీపై అందజేసింది.
- రూ.38 కోట్ల 9లక్షల 320 విలువైన మొత్తం 360 యూనిట్లను రైతు సంఘాలకు అందజేయగా, వారికి రూ.13 కోట్ల 23లక్షల 51వేల 700 మేరకు సబ్సిడీ అందజేసింది.

నేడు రెండో విడత అమలు..

యంత్ర సేవా పథకంలో భాగంగా శుక్రవారం రెండో విడత పంపిణీ కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో పంపిణీ ప్రారంభించనున్నారు. శ్రీకాకుళం అంబేడ్కర్ కళా వేదికలో సమావేశం అనంతరం కోడి రామ్మూర్తి స్టేడియంలో ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా పంపిణీ జరగనుంది. రెండో విడతలో రూ.37 కోట్ల 36 లక్షల 18 వేల 700 విలువైన 269 ట్రాక్టర్లు, 37 ఇంప్లిమెంట్స్, 22 హార్వెస్టర్లను కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల కింద పనిచేయనున్న 306 రైతు సంఘాలకు పంపిణీ చేయనున్నారు. యూనిట్లు పొందుతున్న సంఘాలకు రూ.12 కోట్ల 94 లక్షల 53 వేల 700వరకు సబ్సిడీ అందనుంది. నియోజకవర్గాల వారీగా చూస్తే **ఇచ్ఛాపురంలో** 34, **పలాసలో 41, టెక్కలిలో** 44, **నరసన్నపేటలో** 57, **శ్రీకాకుళంలో** 17, **ఎచ్చెర్లలో** 45, **ఆమదాలవలసలో** 37, **పాతపట్నం నియోజకవర్గంలో 58 రైతు సంఘాలకు** యంత్ర **సేవా పరికరాలు అందజేయను**న్నారు.



యంత్ర సేవా పథకం కింద రెండు **విడతల్లో 631 ట్రాక్టర్లు, ఇంప్లిమెంట్స్, 57 హార్వెస్టర్లు పంపిణీ చేసినట్లు** అవుతుంది. **వీటికోసం రూ.75 కోట్ల** 45లక్షల **50వేల 700 మేరకు ఖర్చు** చేయగా, **రూ.26కోట్ల 18 లక్షల 5వేల** 400 మేర **సబ్సిడీ అందజేస్తున్నారు. ఈ యం**త్రాలను **అద్దె ప్రాతిపదికన సన్న, చిన్న కారు** రైతులు **వినియోగించుకోవచ్చు.**

చంద్రబాబు హయాంలో భారీ అవినీతి..

టీడీపీ హయాంలో అవినీతి చీడ రైతు పథకాలకూ వ్యాపించింది. ఎన్నికల ముందు జిల్లాకు 24 ట్రాక్టర్లను, అంతకుముందు కొన్ని వరికోత యంత్రాలను మంజూరు చేసింది. వరికోత యంత్రాల విషయంలో తొలుత పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుంది.

- నిర్ణయించిన సామర్థ్యం కన్నా తక్కువ సామర్థ్యం గల వరికోత యంత్రాలను లబ్ధిదారులకు అంటగట్టారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయి.



కోడి రామ్మూర్తి స్టేడియంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న హార్వెస్టర్లు

- ఆ తర్వాత ప్రభుత్వం ఒక్కో ట్రాక్టర్‌పై రూ.లక్షా 50వేల వరకు సబ్సిడీ ఇస్తే దానిని టీడీపీ నేతలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు స్వాహా చేశారు.
- అధికార పార్టీ ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఇస్తే చాలు నాడు మంజూరు చేసేవారు. ఆ తర్వాత మేం చూసుకుంటామన్నట్టు ఓ రైతు పేరుతో దరఖాస్తు, పొలం ఉన్నట్టు ధ్రువీకరణ పత్రం, వ్యవసాయ శాఖ అధికారుల ఆమోదం క్షణాల్లో జరిగిపోయేవి.
- పని అయిపోయిన తర్వాత లబ్ధిదారుడికి ఎంతో కొంత ఇచ్చేసి, ఆ వాహనాలను బయటికి విక్రయించేసి, ఆ సొమ్మును పంచుకున్న సందర్భాలు ఉన్నాయి.
- 2018 డిసెంబర్, 2019 ఫిబ్రవరి, మార్చిలో రైతు రథం పథకాన్ని గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది.
- జిల్లాలో రైతు రథం పథకం కింద 24 యూనిట్లు(ట్రాక్టర్లు) మంజూరు చేశారు.
- అత్యధికంగా రూ.6లక్షల 28వేల 21 నుంచి అత్యల్పంగా రూ.5లక్షల64వేల720 ధర నిర్ణయించారు. ఇందులో ప్రతీదానికి రూ.లక్షా 50వేలు చొప్పున సబ్సిడీని అందజేశారు.
- ఇంతవరకు రికార్డుల్లో సక్రమంగానే చూపించారు. కానీ క్షేత్రస్థాయిలో ట్రాక్టర్లు ఎక్కడా కన్పించలేదు. అప్పట్లో అవకతవకలు జరిగాయని పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ప్రస్తుత వ్యవసాయ అధికారులు రైతు రథం కింద మంజూరు చేసిన ట్రాక్టర్లపై విచారణ చేపట్టగా టీడీపీ పాలకుల అక్రమాలు బయటపడ్డాయి.
- మంజూరైన 24 ట్రాక్టర్లలో రెండు మాత్రమే అసలైన లబ్ధిదారుల వద్ద ఉన్నాయి. మిగతావి ఎక్కడా లేవు.
- ఇవన్నీ ఏమయ్యాయో టీడీపీ నాయకులకే ఎరుక. మొత్తానికి రైతురథం కింద జరిగిన స్కామ్‌లో దాదాపు రూ.33లక్షల సబ్సిడీ సొమ్ము స్వాహా అయినట్టు తేలింది.

● రైతు భరోసా లబ్ధి

రూ.236.66 కోట్లు



రైతులకు నమూనా చెక్కు అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని, మంత్రి ధర్మాన, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎమ్మెల్సీలు నర్తు రామారావు, దువ్వాడ శ్రీనివాస్ తదితరులు

- వైఎస్సార్ రైతుభరోసా - పీఎం కిసాన్ నిధులు విడుదల
- జిల్లాలో 3.16 లక్షల మందికి రూ.236.66 కోట్లు మంజూరు
- హాజరైన స్పీకర్ తమ్మినేని, మంత్రి ధర్మాన

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ రైతుభరోసా - పీఎం కిసాన్ పథకం నిధులను సీఎం జగన్‌మోహన్ రెడ్డి విడుదల చేయడంతో అన్నదాతల్లో ఆనందం వెల్లివిరుస్తోందని రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గురువారం వరుసగా ఐదో ఏడాది రాష్ట్రంలోని రైతులు, కౌలు రైతులు, అటవీ భూముల సాగుదారులకు 2023-24 ఏడాదికి సంబంధించి మొదటి విడత ఆర్థిక సహాయాన్ని కర్నూలులో సీఎం జగన్ విడుదల చేశారు. దీనికి సంబంధించి శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే నమ్మకంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రైతు భరోసా కేంద్రాలు రైతు కార్యాలయాలుగా రూపుదిద్దుకున్నాయని చెప్పారు. అత్యాధునిక పరికరాలతో సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధ్యమవుతాయని తెలిపారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తే మంచి లాభాలు పొందవచ్చన్నారు.

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ ఖరీఫ్ పనులు ప్రారంభించక ముందే రైతుల ఖాతాలో నిధులు జమచేయడం శుభపరిణామమన్నారు. ఈ ఏడాది మొదటి విడతలో 3,15,544 మంది రైతులకు రూ.236.658 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాల కారణంగా నష్టపోయిన వ్యవసాయ, ఉద్యాన రైతులు 251 మందికి ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6.54 లక్షలు జమ చేసినట్లు తెలిపారు.
- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో రైతులు పడుతున్న అవస్థలు గుర్తించి ఇప్పుడు అన్ని విధాలా ఆదుకుంటున్నారని చెప్పారు. పాతపట్నం నియోజకవర్గంలో 42,059 మంది రైతులకు గాను రైతు భరోసా అందజేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం రైతులకు నమూనా చెక్కును అందజేశారు. వ్యవసాయ అనుబంధ సంస్థలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్స్‌ను తిలకించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారా వు, కేంద మాజీ మంత్రి కిల్లి కృపారాణి, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, వ్యవసాయ బోర్డు అధ్యక్షుడు నేతాజీ, అగ్రి మిషన్ సభ్యులు గొండు రఘురామ్, జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి.ప్రసాద్, మూకళ్ల తాతబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, రైతులు పాల్గొన్నారు.

రైతుల కష్టాలు దూరం



గతంలో పండినా, పండకపోయినా ఏడాది తిరిగే సరికి బ్యాంకులో తీసుకున్న అప్పును వడ్డీతో కట్టి మళ్లీ అప్పులు పొందాల్సిన దుస్థితి. దీంతో ఇబ్బందులు తప్పేవి కావు. ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతులకు వైఎస్సార్ రైతు భరోసా, వడ్డీలేని రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ వంటివి మంజూరు చేస్తుండటం ఆనందంగా ఉంది.

– పడాల రంజిత్, రైతు, గంగువాడ, పాతపట్నం మండలం

ఆ జైలు కంటే నరకం నయం

- నాన్న చనిపోయిన విషయం కూడా తెలియలేదు
- పాక్ చెర నుంచి విడుదలైన మత్స్యకారుడు భాస్కరరావు ఉద్వేగం



భాస్కరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: పాకిస్థాన్ జైలు నుంచి విడుదలై ఇంటికి తిరిగి వస్తానని అనుకోలేదని ఎచ్చెర్ల మండలం బడివానిపేట పంచాయతీ జాలారు కొయ్యాంకు చెందిన మత్స్యకారుడు మైలపల్లి భాస్కరరావు ఉద్వేగంతో చెప్పారు. 2018 నవంబర్ 18న గుజరాత్ రాష్ట్రం వీరావల్‌లో చేపల వేట సాగిస్తూ పొరపాటున పాక్ జలాల్లో ప్రవేశించిన భాస్కరరావును అక్కడి కోస్టుగార్డులు పట్టుకుని కరాచీ జైలులో పడేశారు. ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో ఐదేళ్ల తర్వాత పాక్ జైలు నుంచి విడుదలైన భాస్కరరావు గత నెల 13న గుజరాత్ చేరుకున్నారు. వైద్య సేవలు అందుకొని పూర్తిగా కోలుకున్నాక గురువారం స్వగ్రామానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులను, గ్రామస్తులను చూసి ఆనందంతో ఉద్వేగానికి గురయ్యారు. భాస్కరరావు తల్లి భూదేవి గతంలోనే మృతి చెందింది. తండ్రి కృష్ణమూర్తి 2021లో మృతి చెందాడు. ఈ విషయం భాస్కరరావుకు తెలియదు. ఈ నెల 13న గుజరాత్ చేరుకున్నాక గ్రామస్తులతో ఫోన్‌లో మాట్లాడుతుండగా విషయం తెలిసింది.

జైల్లో నరకం..

కరాచీ జైల్లో వాళ్లు పెట్టిందే తినాలని, ఎటువంటి బయట సమాచారం తెలియనివ్వరని భాస్కరరావు తెలిపారు. ఉర్దూ రాకపోవడం, సరైన ఆహా రం లేకపోవడంతో నరకయాతన అనుభవించినట్లు గుర్తు చేసుకున్నా రు. ఇంటికి తిరిగి వస్తానని, తన వారిని చూస్తానని అస్సలు అనుకోలేదని చెప్పారు. ఇప్పుడు అందరినీ చూశాక పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయ్యిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈయన అవివాహితుడు. ఇద్దరు సోదరులు గ్రామంలోనే ఉన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు..

గ్రామానికి చేరుకున్న భాస్కరరావును మత్స్య కార నాయకులు గురువారం పరామర్శించారు. నిత్యావసర సరుకులు, స్వీట్లు అందజేశారు. పాక్ చెర నుంచి తనను విడిపించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఏపీ మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, నాయకులు కొమర శంకరరావు, కోనాడ నర్సింగరావు, సర్పంచ్ తాతారావు, మూగి శ్రీరాములు, మూగి గురుమూర్తి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

● చకచకా పింఛన్ల పంపిణీ

జిల్లాలో వైఎస్సార్ పింఛన కానుక పంపిణీ గురువారం చకచకా సాగింది. వేకువజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారులు వద్దకు వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. జిల్లాలో 3,13,372 మందికి రూ.84.84 కోట్లు విడుదల కాగా, సాయంత్రం నాటికి 2,25,816 మందికి పెన్షన్ అందజేశారు. తొలిరోజు పంపిణీ 72.06 శాతంగా నమోదైంది.

–శ్రీకాకుళం పాతబస్టాండ్



శ్రీకాకుళం 23వ వార్డులో రమణమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సంతోషి

● 'పర్యావరణ' పోటీలకు విశేష స్పందన



ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని 'ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కారం' అనే అంశంపై శ్రీకాకుళం పీఎన్‌కాలనీలోని న్యూ సెంట్రల్ స్కూల్‌లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం శ్రీకాకుళం ఈఈ ఎస్.శంకర్‌నాయక్ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీలకు ప్రభుత్వ, ప్రవేటు స్కూల్స్ నుంచి 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ నెల 5న కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కరుణశ్రీ, హరీష్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

–శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

ఇదేం పని?

- ఉపాధి పనుల్లో మర్రిపాడు ఫీల్డ్ అసిస్టెంట్ మాయాజాలం
- మృతులు, విదేశాల్లో ఉన్న వారి పేరిట మస్టర్లు
- 1902 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదుతో అక్రమాలు వెలుగులోకి..



మర్రిపాడులో ఉపాధి పనిచేస్తున్న వేతనదారులు

సంతబొమ్మాళి: మండలంలోని మర్రిపాడు ఫీల్డ్ అసిస్టెంట్ గున్న సుదర్శనరావు ఉపాధి హామీ పథకం పనుల్లో మాయాజాలం చూపించి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడు. టోల్‌ఫ్రీ నంబర్ 1902కు ఫిర్యాదు చేయడంతో ఇతని అక్రమాలు ఒక్కొక్కటీ వెలుగులోకి వస్తున్నాయి. మర్రిపాడు పంచాయతీ చిన్నమర్రిపాడుకు చెందిన జనపాన ధనం (జాబ్ కార్డు:20220) నాలుగేళ్లుగా ఉపాధి పని చేస్తున్నా వేతనాలు రావడం లేదు. ఈ విషయమై సుదర్శనరావును ప్రశ్నించినా స్పందించకపోవడంతో ప్రభుత్వ టోల్ ఫ్రీ నెంబర్ 1902కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేశారు. దీంతో మండల ఉపాధి హామీ అధికారులు గ్రామానికి వచ్చి ఆరా తీశారు. గ్రామంలో ఉన్న మరొక వ్యక్తి అకౌంట్‌కు ఈమె డబ్బులు జమ అవుతున్నాయని గుర్తించారు. ఈ విషయం ఫీల్డ్ అసిస్టెంట్‌కు తెలిసినా పట్టించుకోలేదు. గిన్ని చిట్టెమ్మ (జాబ్‌కార్డు: 20058) 2017లో, పోతల కామమ్మ (20137), బుట్ట కాంతమ్మ (20208) 2021లో చనిపోయారు. అయినా వీరి ఖాతాలకు ఉపాధి డబ్బులు జమవుతున్నాయి. బచ్చు సంతోష్ (20184) డబ్బు శ్రీను (20190), గుజ్జు వసంత్ (20195), గిన్ని సింహాచలం (20069), జనపాన రాజు (20014), బచ్చు మహేష్ (20012), జనపాన వెంకటరావు (20114) వీరందరూ విదేశాల్లో ఉన్నా ఉపాధి పనులు చేస్తున్నట్లు వారి ఖాతాలకు డబ్బులు జమవుతున్నాయి. వలసకార్మికులు, అనారోగ్యంతో ఉన్నవారు, ఉపాధి పనికి వెళ్లని వారి ఖాతాలకు డబ్బులు జమకావడం, చెరి సగం పంచుకోవడం చేస్తున్నారని వేతనదారులు అంటున్నారు. 2023 మే 1 నుంచి మే 18 వరకు మర్రిపాడులో ఉపాధి పనులు జరగకపోయిన జరిగినట్లు చూపించి, బినామీలకు మస్టర్లులను వేసి లక్షల రూపాయలు దోచుకున్నట్లు వేతనదారులు చెబుతున్నారు. గొంగొళం, బూర్జబంద చెరువుల్లో పని జరగకపోయినా జరిగినట్లు మస్టర్లల్లో నమోదు చేసి నిధులను మింగేశారని, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విచారణ చేసి చర్యలు..

మర్రిపాడు పంచాయతీలో జరిగిన ఉపాధి పనులపై విచారణ జరుపుతాం. నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటాం.

– జి.వి.చిట్టిరాజు, డ్వామా పీడీ

1902కు ఫోన్ చేశా..



నాలుగేళ్లుగా పనిచేస్తున్నా వేతనం అందలేదు. ఫీల్డ్ అసిస్టెంట్‌కు అడిగినా పట్టించుకోలేదు. దీంతో టోల్‌ఫ్రీ నంబర్ 1902కు ఫోన్ చేయడంతో అధికారులు వచ్చారు. ఫీల్డ్ అసిస్టెంట్ సుదర్శనరావు ఏడాదిలో పని చేసిన వేతనం ఇస్తానని కాళ్లబేరానికి వచ్చాడు. మిగిలిన మూడేళ్ల వేతనం ఎవరు ఇస్తారని అడిగితే సమాధానం లేదు. అధికారులు పరిశీలించిన తర్వాత గ్రామంలోని వేరొక అకౌంట్‌కు జమ అయ్యాయని తెలిసింది. నాకు న్యాయం చేయాలి.

– జనపాన ధనం, ఉపాధి వేతనదారు, చిన్నమర్రిపాడు

మోగిన కాలేజీ గంట..

- పునఃప్రారంభమైన జూనియర్ కళాశాలలు
- తొలిరోజు అంతంత మాత్రమే హాజరు



తరగతులకు హాజరైన విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ కోర్సులను అందిస్తున్న జూనియర్ కళాశాలలు వేసవి సెలవుల అనంతరం గురువారం పునఃప్రారంభమయ్యాయి. పూర్తిస్థాయిలో తెరుచుకోవడంతోపాటు క్లాసులు కూడా మొదలయ్యాయి. అయితే తొలిరోజు అంతంత మాత్రంగానే విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఇంటర్మీడియెట్ బోర్డు నిర్దేశిత షెడ్యూల్‌ను విడుదల చేసింది.

నాలుగేళ్ల తర్వాత..

కరోనా వైరస్ (కోవిడ్)తో అస్తవ్యస్తమైన విద్యావ్యవస్థ ప్రభుత్వ పకడ్బందీ చర్యలతో ఎట్టకేలకు పూర్తిస్థాయిలో గాడినపడ్డట్టయింది. వాస్తవానికి కరోనా విజృంభనకు ముందు ఏడాది వరకు ఎటా జూన్ ఒకటో తేదీన జూనియర్ కళాశాలలు తెరుచుకునేవి. కోవిడ్‌కు ముందు 2019 జూన్ ఒకటో తేదీన కళాశాలలు పునఃప్రారంభమయ్యాయి. 2020 మార్చిలో విజృంభించిన కోవిడ్ కారణంగా 2020లో ఆగస్ట్ నెలలో, 2021లో నవంబర్‌లో, 2022 జూలై మాసాల్లో కళాశాలలు అనేక ఆంక్షలు, నిబంధనల నడుమ తెరుచుకున్నాయి. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం మాస్కులు ధరించి, శానిటైజర్లతో చేతులు శుభ్రపరుచుకుని అనేక ఆంక్షలు నడుమ తరగతులు నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకుంది. ఈ ఏడాది 2023లో జూన్ ఒకటో తేదీన కళాశాలలు మళ్లీ పాత విధానంలో తెరచుకున్నాయి.

బోధనకు ఆటంకం లేకుండా..

సర్కారీ కళాశాలల్లో తరగతుల నిర్వహణకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంది. జూన్ ఒకటి నుంచి కాంట్రాక్ట్ ఫ్యాకల్టీతోపాటు గెస్ట్‌ఫ్యాకల్టీని కూడా పనిచేసేలా రెన్యువల్ ఉత్తర్వులు వెలువరించింది. 375 కాంట్రాక్ట్, 90 మంది గెస్ట్ ఫ్యాకల్టీ పనిచేస్తున్నారు. జిల్లాలో మొత్తం 168 జూనియర్ కళాశాలలు ఉండగా.. ఇందులో 38 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో అక్కడక్కడా మిగిలి ఉన్న ఖాళీలను గతంలో పనిచేసినవారితోపాటు అర్హులైన గెస్ట్ ఫ్యాకల్టీతో భర్తీ చేయనున్నారు.

227 రోజులు పనిదినాలు..

2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ కోర్సులను అందిస్తున్న జూనియర్ కళాశాలలు 227 రోజులు పనిచేయనున్నాయి. 2024 మార్చి 28 ఆఖరి పనిదినం. 2024 మార్చి 29 నుంచి మే 31 వరకు వేసవి సెలవులు. 2024 ఫిబ్రవరి రెండో వారంలో ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి మొదటివారం నుంచి పబ్లిక్ పరీక్షలు జరుగుతాయి. ఇంటర్మీడియెట్ బోర్డు వార్షిక క్యాలెండర్ ప్రకారం జూన్ ఒకటి నుంచి మార్చి 28వ తేదీ వరకు మొత్తం 302 రోజులు ఉండగా ఇందులో 227 రోజులు కళాశాలలు పనిచేయనున్నాయి. మరో 75 రోజులు రెండవ శనివారం, ఆదివారం, ఇతర సెలవు దినాలు. అలాగే జూలై 26 నుంచి 28 వరకు మొదటి యూనిట్, ఆగస్టు 24 నుంచి 26 వరకు రెండో, అక్టోబర్ 16 నుంచి 18 వరకు మూడో, నవంబర్ 23 నుంచి 25వ తేదీ వరకు నాలుగో యూనిట్ పరీక్షలు జరుగుతాయి. అలాగే త్రైమాసిక (క్వార్టర్లీ) పరీక్షలు సెప్టెంబర్ 16 నుంచి 23వ తేదీ వరకు, అర్ధ సంవత్సర పరీక్షలు డిసెంబర్ 18 నుంచి 23 వరకు, ప్రీఫైనల్ పరీక్షలు 2024 జనవరి 18 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

జిల్లాలోని మేనేజ్‌మెంట్లవారీగా జూనియర్ కళాశాలలు

మేనేజ్‌మెంట్/కేటగిరీ	సంఖ్య
ప్రభుత్వ కళాశాలలు	38
మోడల్ జూనియర్ కళాశాలలు	13
సోషల్ వెల్ఫేర్	09
ట్రైబల్ వెల్ఫేర్	01
కేజీబీవీ జూనియర్ కళాశాలలు	17
కోపరేటివ్ కళాశాలలు	02
ఒకేషనల్ కళాశాలలు	01
ప్రైవేట్, అన్–ఎయిడెడ్ కళాశాలలు	87
మొత్తం	168

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలలు సోమవారం తెరుచుకున్నాయి. తరగతులు కూడా మొదలవుతాయి. సెలవులు ముగిశాయి కాబట్టి విద్యార్థులు కళాశాలలకు హాజరవ్వాలి. తరగతులను సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో పాఠాలు బోధించడంతోపాటు అన్ని వసతులు, సౌకర్యాలతో విద్యను అందించేలా చర్యలు తీసుకున్నాం.

– కోట ప్రకాశరావు, ఇంటర్మీడియెట్ విద్య జిల్లా అధికారి(డీఐఈవో), శ్రీకాకుళం

బార్ అసోసియేషన్ సమావేశం



మాట్లాడుతున్న సూర్యారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ భవనంలో అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పాత క్యాంటీన్ బకాయిలు, క్యాంటీన్ నిర్వహణకు టెండర్ల ఆహ్వానం, జనరేటర్‌కు మరమ్మతుల కోసం అంచనాలు రూపొందించడం తదితర అంశాలపై సమావేశంలో చర్చించినట్టు సూర్యారావు తెలిపారు. ఈ నెల 20వ తేదీన మరోసారి సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చిస్తామన్నారు. అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి ధరావత్తుల లెక్కలపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి పి.రాము, ఉపాధ్యక్షుడు జి.చంద్రమౌళి, స్పోర్ట్సు సెక్రటరీ గుంగు భాస్కరరావు, మహిళా ప్రతినిధి హరిప్రియ, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, సీనియర్ న్యాయవాదులు కొంక్యాన సుభాష్, ఎ.కృష్ణరాజు, కె.అప్పీనునాయుడు, మామిడి క్రాంతి, కూన రాజారావు, పొన్నాడ వెంకటరమణారావు, బీసీ న్యాయవాదులు సంఘం ప్రతినిధులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, కూన అన్నంనాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో మహాస్వామిజీ



స్వామిజీకి ప్రసాదాన్ని అందజేస్తున్న శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లిసూర్యనారాయణ స్వామి వారిని విజయవాడకు చెందిన భువనేశ్వరి పీఠాధిపతి శ్రీకమలానంద భారతి మహాస్వామిజీ తన శిష్యగణంతో కలిసి గురువారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలికి అంతరాలయ దర్శనాన్ని చేయించారు. ఆదిత్యునికి స్వామిజీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అనివెట్టి మండపంలో కమలానంద భారతి కాసేపు అనుగ్రహభాషణం చేశారు. ఆలయంలో అద్భుతంగా అర్చనావిధానం జరుగుతోందన్నారు. ఈవో వి.హరిసూర్యప్రకాష్, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

శ్రీముఖలింగంలో హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పంచరాత్రి కల్యాణ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మూడో రోజైన గురువారం జేష్టమాసం సందర్భంగా ఔపాసన, హోమం, బలిహారణ, హారతి మంత్రపుష్పం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు చేశారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి క్షీరాభిషేకం చేశారు.

నవోదయ దరఖాస్తుల సవరణకు అవకాశం



మాట్లాడుతున్న పరశురామయ్య

సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 11వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఏమైన పొరపాట్లు ఉంటే శుక్రవారంలోగా సవరణ చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య గురువారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్నవారు మేల్, ఫీమేల్, కులం, ఏరియా, వికలాంగత్వం తదితర వివరాలు మాత్రమే సవరణ చేసుకోవాలని సూచించారు. అవకాశాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్ష కోసం విద్యార్థులు సన్నద్ధం కావాలన్నారు.

డీటీసీగా శివరాం ప్రసాద్ నియామకం



శివరాం ప్రసాద్

శ్రీకాకుళం రూరల్: డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా (డీటీసీ) శివరాం ప్రసాద్ నియామకమయ్యారు. ఈయన ప్రస్తుతం అనంతపురం జిల్లా డీటీసీగా పనిచేస్తున్నారు. త్వరలో ఈయన బాధ్యతలు తీసుకోనున్నారు. కాగా ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన శ్రీదేవి పదోన్నతిపై విశాఖకు బదిలీపై వెళ్లారు.

మైనర్‌పై అత్యాచార యత్నం!

ఇచ్ఛాపురం: మైనర్ బాలికపై 55 ఏళ్ల వృద్ధుడు అత్యాచారయత్నానికి పాల్పడినట్టు ఫిర్యాదు అందిందని ఇచ్ఛాపురం పట్టణ పోలీసులు గురువారం తెలిపారు. పట్టణంలోని గొల్లవీధికి చెందిన మైనర్‌పై పి.జగన్నాయకులు ఘోరానికి పాల్పడినట్టు పేర్కొన్నారు. బాలిక తల్లి గురువారం చేసిన ఫిర్యాదు మేరకు నిందితుడ్ని అదుపులోకి తీసుకొని అతనిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్ఐ కె.గోవిందరావు తెలిపారు.

యువత మోసపోవడానికి సిద్ధంగా లేరు

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్



మాట్లాడుతున్న ఎం.వి స్వరూప్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చంద్రబాబు మాటలు నమ్మి యువత మోసపోవడానికి సిద్ధంగా లేదని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి స్వరూప్ అన్నారు. ఇటీవల రాజమండ్రిలో నిర్వహించిన టీడీపీ మహానాడులో మరోసారి నిరుద్యోగ యువతను మోసం చేసేందుకు చంద్రబాబు అబద్ధాలు ప్రకటించారని..అయితే మోసపోవడానికి యువత సిద్ధంగా లేరన్న విషయాన్ని ఆయన గుర్తెరగాలన్నారు. ఆ పార్టీ మ్యానిఫెస్టో బూటకమన్నారు. శ్రీకాకుళంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో అధికారం చేపట్టిన తరువాత ఇంటికో ఉద్యోగం ఇస్తామని.. లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన చంద్రబాబు వాటిని ఆమలు చేయకుండా మోసగించారన్నారు. లక్షలాది మంది నిరుద్యోగులు ఉంటే కేవలం నామమాత్రంగా వందల్లో ఉద్యోగాలిచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. రాజకీయ లబ్ది కోసం మాత్రమే నిరుద్యోగ భృతి అంటూ మరోసారి యువతను మోసం చేస్తున్నారన్నారు. ఆరు నెలలకు ముందు ఎన్నికలు వస్తున్నాయనగా కేవలం టీడీపీకి చెందిన పచ్చచొక్కాలకు మాత్రమే భృతి ఇచ్చారన్నారు. ప్రభుత్వ అధికారిక వైబ్‌సైట్‌లో నిరుద్యోగ భృతి కోసం 14 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా కేవలం రెండు లక్షల మందికి మాత్రమే చంద్రబాబు సర్కార్ భృతి చెల్లించిందన్నారు. 2014–2019 ఐదేళ్ల బాబు పాలనలో 14 వేల ఉద్యోగాలు మాత్రమే కల్పిస్తే, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే దేశంలో ఎక్కడా లేని విధంగా 1.50 లక్షల సచివాలయ ఉద్యోగాలు, పలు శాఖల్లో మరో 30 వేల ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సమావేశంలో నగర యువజన విభాగం నాయకులు బరాటం సంతోష్, గుండ హరీష్, నక్క రామరాజు, ఎండ రమేష్, సనపల రామారావు, సీపాన రామారావు, కనపల తేజేశ్వరరావు, శివకుమార్, మధు, పిరగడి లక్ష్మణ, సింహాద్రి శ్రీను, ఇషాక్ హుస్సేన్, అమర్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

సొంతగూటికి 34 మంది పోలీసు సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో 34 మంది పోలీసు సిబ్బందికి అటాచ్‌మెంట్లు రద్దు చేస్తూ.. తిరిగి తమ మాతృ పోలీస్‌స్టేషన్లకే పోస్టింగ్‌లు ఇచ్చినట్లు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు కార్యాలయం నుంచి బుధవారం అర్ధరాత్రి మెమో జారీ చేశారు. ఇందులో ఏడుగురు ఏఎస్ఐలు, 16 మంది పీసీలు, 11మంది హెచ్‌సీలు ఉన్నారు. మరో పదిమందికి (వ్యక్తిగత బదిలీల్లో భాగంగా ఇద్దరు పీసీలు, ఒక హెచ్‌సీ) బదిలీలు జరిగినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ స్పాట్ ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్) గురువారం ప్రారంభమైంది. శ్రీకాకుళం ప్రభుత్వ (బాలుర) జూనియర్ కళాశాల కేంద్రంగా మూడు విడతల్లో భాగంగా గురువారం మొదటి స్పెల్ మూల్యాంకనం మొదలైంది. తెలుగు, హిందీ, ఇంగ్లీషు, మాథ్స్, బోటనీ, సివిక్స్ పేపర్ల దిద్దుబాటు ప్రక్రియ జరుగుతోంది. మూల్యాంకనానికి హాజరైన సీఈలు, ఎస్ఈలు, ఏఈలకు అధికారులు పలు సూచనలు చేశారు.

బ్రాండెడ్ ఉపకరణాలతో విద్యుత్ ఆదా



మాట్లాడుతున్న దైవప్రసాద్

అరసవల్లి: భవనాలను నిర్మిస్తున్న బిల్డర్లు తప్పనిసరిగా బ్రాండెడ్ పరికరాలను మాత్రమే వినియోగించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఎల్.దైవప్రసాద్ సూచించారు. నాణ్యమైన విద్యుత్ పరికరాల వినియోగంతో కరెంటు ఆదా అవుతోందన్నారు. నీతిఆయోగ్ సూచనల మేరకు లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ నిర్వహించిన ఇంధన పరిరక్షణ అంశంపై స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో భవనాలు, అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్న యజమానులు, కాంట్రాక్టర్లు, బిల్డర్లు ఇంధన పొదుపు విషయంపై సీరియస్‌గా వ్యవహరించాలని..లేదంటే భావితరాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని హెచ్చరించారు. జిల్లాలో ప్రస్తుతానికి డిమాండ్ మేరకు విద్యుత్ సరఫరా చేస్తున్నప్పటికీ..గ్రామీణ ప్రాంతాల్లో సైతం అధికంగా ఏసీల వినియోగంతో విద్యుత్ డిమాండ్ పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బిల్డర్లతో పాటు ప్రతివారు ఇంధన పొదుపుపై అవగాహన కల్పించుకోవాలన్నారు. విద్యుత్ ప్రొటక్షన్ విభాగ ఏడీఈ పైడి యోగేశ్వరరావు మాట్లాడుతూ.. తప్పనిసరిగా ఎల్ఈడీ లైట్లు, టీవీలు వినియోగించాలని సూచించారు. ఉపయోగంలో లేని విద్యుత్ ఉపకరణాలను స్విచ్ ఆఫ్ చేయాలని సూచించారు. అనంతరం నీతిఆయోగ్ ప్రతిపాదించిన పలు అంశాలను ఆయన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా బిల్డర్లుకు, విద్యుత్ శాఖ సిబ్బందికి వివరించారు. టెక్నికల్ ఈఈ ఎల్‌సీహెచ్ పాత్రుడు, జేఏఈలు సనపల వెంకటరావు, ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత బొడ్డేపల్లి

- మాజీ డిప్యూటీ సీఎం కృష్ణదాస్
- నుసరాంలో రాజగోపాలరావు విగ్రహావిష్కరణ

పోలాకి: నిస్వార్థ రాజకీయ నాయకుడు, ప్రజాసేవకుడు దివంగత బొడ్డేపల్లి రాజగోపాలరావు అందరికీ స్ఫూర్తి ప్రదాత అని మాజీ డిప్యూటీ సీఎం, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నుసరాం గ్రామంలో పార్లమెంటు మాజీ సభ్యుడు రాజగోపాలరావు విగ్రహావిష్కరణ, అదే వేదికపై నరసన్నపేట వ్యవసాయమార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కృష్ణదాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొడ్డేపల్లి కుటుంబంతో తమకు ఆత్మీయసంబంధాలు కలిగి ఉన్నాయని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో బొడ్డేపల్లి సత్యవతితో కలసి ఎమ్మెల్యేగా పనిచేసిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. జిల్లాకు రాజగోపాల్ చేసిన చిరస్మరణీయమన్నారు. గొప్పవ్యక్తిత్వం కలిగిన నేత విగ్రహావిష్కరణ తన చేతులమీదుగా జరగడం గొప్పజ్ఞాపకంగా గుర్తుచేసుకోవటంతోపాటు అదృష్టంగా భావిస్తానని చెప్పారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ మాట్లాడుతూ.. కళింగ జాతి ఆణిముత్యం వంటి నాయకుడు బొడ్డేపల్లి శతజయంతి ఉత్సవాలు చేయాలనుకుంటున్న తమ అభిప్రాయం తెలియజేయగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించిన తీరు ఎన్నటికీ మర్చిపోలేమని చెప్పారు. ప్రత్యేక జీవో ద్వారా నిధులు విడుదల చేసి దివంగత ఎంపీ విగ్రహాల ఏర్పాటుతోపాటు, ఘనంగా శతజయంతి వేడుకలు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి కృతజ్ఞతలు తెలియజేశారు. సభకు అధ్యక్షత వహించిన జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడుతూ.. నేటి మాతరం రాజకీయ నాయకులకు రాజగోపాలరావు వంటి నాయకులు రోల్‌మోడల్ అన్నారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, టెక్కలి వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మెన్ అంధవరపు సూరిబాబు పాల్గొన్నారు.



రాజగోపాలరావు విగ్రహావిష్కరణలో కృష్ణదాస్, నాయకులు

పక్కాగా క్లాస్ వర్కు



రిజిస్టర్లు పరిశీలిస్తున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: క్లాస్ వర్కు పక్కాగా జరగాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీ గురువారం పునఃప్రారంభమైన నేపథ్యంలో అర్ట్సు, సైన్స్, ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థులు, బోధకులు, బోధనేతర సిబ్బంది హాజరు, రిజిస్టర్లను పరిశీలించారు. హాజరు మెరుగ్గా ఉండాలని, అకడమిక్ క్యాలెండర్ మేరకు క్లాస్ వర్కు పక్కాగా జరగాలని స్పష్టం చేశారు. హాజరులో ఎవరికీ ఎటువంటి మినహాయింపు ఉండదన్నారు. సమయపాలన తప్పనిసరని స్పష్టం చేశా రు. ఆయన వెంట రిజస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్ర ప్రసాద్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



త్రినాథరావుకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: ఉద్యోగ విరమణ తరువాత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. జిల్లా పోలీసు శాఖలో హోంగార్డుగా పని చేసి గురువారం ఉద్యోగ విరమణ చేసిన కె.త్రినాథరావును జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ దుశ్శాలువతో సన్మానించి జ్ఞాపిక, ప్రశంసాపత్రం, తక్షణ సాయంగా రూ. 5 వేలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో త్రినాథరావు నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ బి.ప్రదీప్ పాల్గొన్నారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు వేళయింది. ఈ నెల 2 నుంచి మొదలుకానున్న పరీక్షలకు జిల్లా విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల్లో జరగనున్న ఈ పరీక్షలకు 10129 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం జరుగుతాయి.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ..

విద్యార్థులు నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతించబోమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. 8.45 నుంచి పరీక్ష కేంద్రాల లోపలకు అనుమతించనున్నారు. 9.30 తర్వాత అనుమతించరు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుకానుంది. పోలీసుల పహారా కాయనున్నారు. పరీక్ష కేంద్రాలను నో మొబైల్ జోన్‌గా ప్రకటించారు. కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్‌తో సహా ఏ ఒక్కరి వద్దా మొబైల్‌ఫోన్లు ఉండటానికి వీల్లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పోలీసులు, మెడికల్ సిబ్బంది సైతం పరీక్ష కేంద్రం బయటే ఉండాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, కాలిక్యులేటర్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావడం నిషేధం.

మౌలిక సదుపాయాలపై దృష్టి..

ప్రభుత్వ ఆదేశాల మేరకు 100 శాతం నేలరాతలు లేకుండా పక్కాగా ఫర్నీచర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. మండే ఎండలు, ఉక్కపోతల నేపథ్యంలో పరీక్ష సమయంలో నిరంతర విద్యుత్, ఫ్యాన్లు, లైటింగ్ ఏర్పాటు, తాగునీరు కల్పనకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. 14 కేంద్రాలకు సీఎస్‌లు, డీవోలను నియమించారు. తనిఖీల కోసం విద్యాశాఖ, రెవిన్యూశాఖ, పోలీసుశాఖల పర్యవేక్షణలో 3 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. 5 రూట్లను గుర్తించి 15 మంది రూట్ ఆఫీసర్లను నియమించారు. పరీక్షల ఏర్పాట్లు విషయమై డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య నేతృత్వంలో అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ ఆలీఖాన్, డీసీఈబీ సెక్రటరీ జి.రాజేంద్రప్రసాద్, డివైఈవోలు, ఎంఈవోలు పర్యవేక్షిస్తున్నారు.

పెద్దబొడ్డపాడులో ముగిసిన ఉత్సవాలు

- అగ్నిగుండాన్ని తిలకించిన భక్తజనం



అగ్నిగుండం తొక్కుతున్న అమ్మవారి దాసుడు మోహనరావు

వజ్రపుకొత్తూరు: పెద్దబొడ్డపాడు గ్రామంలోని కాళీమాత ఉత్సవాలు గురువారం ముగిశాయి. అగ్నిగుండం ప్రవేశంతో ఉత్సవాలకు ముగింపు పలికారు. అమ్మవారి దాసుడు తమ్మినాన మోహనరావు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి అగ్నిగుండం ప్రవేశం చేశారు. అమ్మవారి ఉత్సవాలంటే చాలా చోట్ల సిరిమానుపై పూజారి అధిరోహించి ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. కాని ఉద్దానం పల్లెల్లో కొన్ని చోట్ల అగ్నిగుండం ప్రవేశం జరుగుతుంది. దాదాపు 150 మీటర్ల పొడవుతో ఉన్న అగ్నిగుండంలోని నిప్పులపై మూడు సార్లు నడవడంతో భక్తులు పరవశించిపోయారు. దీన్ని తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఇంటి పైకప్పులపైకి ఎక్కి తిలకించారు. అనంతరం అమ్మవారి దాసుడు పురవీధుల్లో దాసుడు ఇంటింటా తిరిగి దీవెనలు అందించారు. ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ గ్రామ మాజీ సర్పంచ్ ఉప్పాడ ఆనందరావు, ఉప సర్పంచ్ దుంపల గోవిందరావు, నెహ్రూ యువజన సంఘం ప్రతినిధులు టి.శ్రీకాంత్, పి.సీతారాం, దుంపల వల్లభరావు , దేవాదాస్ ధన్యవాదాలు తెలిపారు.



అగ్నిగుండ ప్రవేశాన్ని ఇళ్లపైకెక్కి తిలకిస్తున్న భక్తులు

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	60,760–00
బంగారం(22కి. 10గ్రా.)	55,700–00
వెండి (కిలో)	77,600–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ.519.00
శ్రీకాకుళం	రూ.519.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹152	₹274	₹ 284